క్లుప్తంగా

అన్నదానానికి రూ. 25 వేల విరాళం



అన్నదానం చేస్తున్న వరం కుటుంబ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్ అన్నపూర్ణ నిత్య అన్నదాన పథకానికి గుజరాతీపేటకు చెందిన అందవరపు ప్రసాద్, సంతోష్, పైడి శెట్టి జయంతిలు తన తండ్రి స్వర్గీయ అందవరపు వరం జయంతి సందర్భంగా రూ.25 వేలు విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని సంఘం అధ్యక్షులు గంగుల రమణబాబు, కార్యదర్శి ఫాల్గుణరావుకు అందించినట్లు జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరరావు బుధవారం తెలిపారు. దాతను రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లక్ష్మణ రావు అభినందించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని మంచి సేవా కార్యక్రమం జరుతోందని అన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జోనల్ కన్వీనర్ పైలా శివనారాయణ, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

అంబటి కుటుంబానికి ధర్మాన పరామర్శ



పరామర్శలో మాజీ మంత్రి ప్రసాదరావు తదితరులు

గార: మండలంలోని అంబటివానిపేట గ్రామానికి చెందిన అంబటి లక్ష్మీనరసమ్మ, గోవిందరావులు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు వారి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. చిత్రపటాల వద్ద పూలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శలో ఎంపీపీ గొండు రఘురాం, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, అంబటి శ్రీనివాసరావు, మూకాళ్ల తాతబాబు, గొండు కృష్ణ, గొలివి వెంకట రమణమూర్తి, అంబటి చక్రధరరావు, చినబాబు, రుప్ప శ్రీనివాసరావు ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అందరివాడని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని తెప్పలవలస గ్రామంలో భీమ్ భవన్ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, బొమ్మలాట శ్రీరాములు, ఎంపీటీసీ చోడవరపు అచ్చివాడు, నాయకులు దన్నాన హరి, కొయ్యి సోములరెడ్డి, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

మట్టిమేల్ తలపెట్టవోయ్..

శ్రీకాకుళం కల్చరల్: వినాయక చవితిని పురస్కరించుకొని మంగువారి తోటలోని సంపత్ వినాయక దేవాలయంలో దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 500 మట్టి గణపతి విగ్రహాలతోపాటు పూజా పుస్తకాలను బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త కొండా రాంబాబు మాట్లాడుతూ.. పర్యావరణానికి హాని చేయని మట్టి విగ్రహాలను ఏటా అందచేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మల్లారిదేవి, అర్చకులు గోవిందు వెంకట రామారావు శర్మ ఉన్నారు.

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లిలో ప్రతి ఇంట్లోనూ మట్టి వినాయక విగ్రహాలనే వినియోగించి పూజలు చేయాలని టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఉంగటి వెంకటరమణమూర్తి కోరారు. ఈమేరకు బుధవారం అరసవల్లిలోని వెలమవీధి, నాయీబ్రాహ్మణ వీధి, నీలమ్మ గుడి వీధుల్లో సుమారు 500 మట్టి విగ్రహాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. స్థానిక రామమందిరం కమిటీ బృందం సహకారంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉంగటి పాపారావు, సీర చిన్నారావు, నక్క రామారావు, కునుకు గోవింద్, రుప్ప అప్పన్న, నక్క చిరంజీవి, ఉంగటి రామ్మోహన్, రుప్ప లక్ష్మణరావు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్: మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: వినాయక చవితి సందర్భంగా వివిధ సేవా సంస్థలు మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుతున్నారు.

ఇళ్లు, మండపాల్లో కూడా మట్టి విగ్రహాలనే పూజించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బుధవారం వివిధ ప్రాంతాల్లో మట్టి విగ్రహాల పంపిణీ ప్రక్రియ జరిగింది. పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలే శ్రేష్ఠమని మానవతా సేవ సంస్థ సభ్యులు తెలిపారు. శ్రీకాకుళంలోని రాగోలు కూడలి వద్ద మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, వైస్ చైర్మన్ నటుకుల మోహన్, అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, వాతావరణం, నీరు కాలుష్యం కాకుండా ప్రతిఒకరూ మట్టి వినాయక ప్రతిమలనే ప్రతిష్ఠించి పూజించాలన్నారు. రంగులు, రసాయనాలతో చేసిన వినాయక ప్రతిమలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల జల కాలుష్యం ఏర్పడుతుందని, పర్యావరణ పరిరక్షణకు ముప్పు వాటిల్లుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమలను రూపొందించి సుమారు ఐదు వందల ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మానవతా సంస్థ కన్వీనర్ పార్వతీశం, కోశాధికారి ఎస్.ప్రవీణ్, సభ్యులు పొన్నాడ రోషిణి, పొట్నూరు అప్పారావు, ముక్కు రమణ, కసవయ్య, ప్రసాద్, ఉర్లం శివతేజ ఉన్నారు.



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న దృశ్యం



అరసవల్లి: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం/ శ్రీకాకుళం అర్బన్/ గార: జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా పలువురు ఎంపికయ్యారు. వీరి ఎంపికపై ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థులు, తోటి ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. వీరికి జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో గురువారం జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఉన్నతాధికారులు అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఉత్తమ గురువులకు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, తోటి సిబ్బంది అభినందనలు తెలియజేశారు. అవార్డుకు ఎంపికైనవారి వివరాలు ఇలా ఉన్నాయి.

శ్రీకాకుళం మండలం..

సదా శివప్రధాన్ శ్రీకాకుళం ఫాజుల్‌బేగ్‌పేట ఎంసీఈ స్కూల్ ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం, వల్లూరి ప్రసాదరావు శ్రీకాకుళం, స్కూల్ అసిస్టెంట్ బీఎస్, జి.వినయ్‌కుమార్, పాత్రునివలస జెడ్పీహెచ్‌స్కూల్ స్కూల్, అసిస్టెంట్ హిందీ, పేడాడ వేదవతి, శ్రీకాకుళం రెల్లవీధి ఎంఈసీ స్కూల్ ఎస్‌జీటీ, టి.పురుషోత్తం, శ్రీకాకుళం ఎన్టీఆర్‌ఎంసీహెచ్‌స్కూల్, ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్.

గార మండలం:

మల్లారెడ్డి దేవరాని, శ్రీకూర్మం జెడ్పీహెచ్‌స్కూల్, ప్రధానోపాధ్యాయులు, కె.సత్యన్నారాయణ, బలరాంపురం ఎంపీయూపీ స్కూల్, సోషల్ స్టడీస్ ఎస్ఏ, ఆర్.సుధీర్‌కుమార్, కొర్ని జెడ్పీహెచ్‌స్కూల్, మాథ్స్ స్కూల్ అసిస్టెంట్, ఎం.జగదీశ్వరరావు, వమ్మరవల్లి జెడ్పీహెచ్‌స్కూల్ స్కూల్ అసిస్టెంట్ హిందీ, ఎం.వెంకటేశ్వరరావు, కళింగపట్నం ఎంపీయూపీ స్కూల్ హెచ్‌ఎం, ఎల్.సీతారామరాజు, అంపోలు జెడ్పీహెచ్‌స్కూల్ ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం నుంచి ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. పొన్నాడ గ్రామంలోని కేజీబీవీ పాఠశాల ప్రత్యేకాధికారి ఎం.సూర్యకళ, ముద్దాడ బీసీ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న తమ్మినేని నారాయణరావు, దోమాం ప్రాథమికోన్నత పాఠశాలలో ఎజ్జీటీగా పనిచేస్తున్న సింగూరు శ్రీనివాసరావు ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని ఆరుగురు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. బెజ్జిపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సామవేదుల రమణ, మెట్టవలస పాఠశాల హెచ్‌ఎం వి.సత్యనారాయణ, అదపాక పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.వి.కామేశ్వరరావు, పట్నాల కృష్ణరావు, బొంతువలస ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.వి.నాగేశ్వరి, లక్ష్మీపురం ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయులు పెరుమాళ్ల వసంతలక్ష్మికి అవార్డులు ప్రకటించారు.



హెచ్‌ఎం మీసాల వెంకటేశ్వరరావు,



మీగడ జగదీశ్వరరావు, హిందీ ఉపాధ్యాయుడు



ఎల్.సీతారామరాజు, పీఈటీ, అంపోలు



ఎం.సూర్యకళ



తమ్మినేని నారాయణరావు



సింగూరు శ్రీనివాసరావు



ఎస్.వి.నాగేశ్వరి



టేకి పురుషోత్తం



శివప్రసాద్



పేడాడ వేదవతి,



విల్లూరి ప్రసాదరావు

అమ్మపేరిట మొక్క నాటుదాం

ఎచ్చెర్ల: లావేరు మండలం బుడుమూరు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఏపీ ఎన్‌జీసీ జిల్లా కో–ఆర్డినేటర్ పూజారి గోవిందరావు ఆధ్వర్యంలో అమ్మపేరిట మొక్క నాటుదాం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరించారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిపేరిట మొక్కలను నాటితే తల్లి ఒడిలో ఉన్నట్లే ఉంటుందన్నారు. పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని కాపాడినవారవుతారన్నారు. తొమ్మిది మంది విద్యార్థులు అమ్మ పేరిట పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటారు. వారిని పాఠశాల హెచ్‌ఎం ఉరిటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



మొక్కలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యం

శ్రీకాకుళం అర్బన్: మొక్కలతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని బీఎస్ఎన్ఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ యోగేశ్వరరావు అన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించి జీవకోటిని కాపాడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. శ్రీకాకుళంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం హర్షవల్లి ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన వనమహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని సంరక్షిద్దామని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.ఎ.ఎస్.వి.ప్రసాద్ (హారికా ప్రసాద్), అధ్యక్షులు వావిలపల్లి జగన్నాథనాయుడు, సెక్రటరీ మణిశర్మ, ఉపాధ్యక్షులు తర్లాడ అప్పలనాయుడు, కోశాధికారి లక్ష్మీకాంత్, లక్ష్మీపతి, మెంబర్‌షిప్ కమిటీ చైర్‌పర్సన్ ఉషారాణి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టి.కూర్మారావు, మజ్జి సుమ, నిహార్‌నాయుడు, న్యాయవాదులు గొంటి చంద్రమోహన్ , గొంటి జ్యోతిర్మయి, వాసు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఏజీఎం యోగీశ్వరరావు, క్లబ్ ప్రతినిధులు

నాటక సమాజాలకు ప్రోత్సాహం కావాలి

శ్రీకాకుళం కల్చరల్: ఎంతో కాలంగా కళాకారులు సమాజాలను నడిపిస్తున్నారని, ప్రస్తుతం నాటక సమాజాలకు ప్రజల ప్రోత్సాహం ఎంతో అవసరమని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో లలితశ్రీ కళాసమితి 56వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం జరిగింది. భిలాయ్‌కి చెందిన ప్రవాసాంధ్రా ప్రజా నాట్యమండలి అధ్యక్షులు ఎల్.రుద్రమూర్తి మాట్లాడుతూ.. నాటక పరిషత్తుల నిర్వహణ ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామని చెప్పార. ఎందరో నటీనటులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు సనపల నారాయణమూర్తి, చిట్టి వేంకటరావు, పన్నాల నర్సింహమూర్తి, ఇప్పిలి శంకరశర్మ, పన్నాల రామకృష్ణ, కేశిరెడ్డి రాజేశ్వరి, రవితాయి, గుత్తు చిన్నారావు, నిక్కు హరిసత్యన్నారాయణ, మెట్ట పోలినాయుడు, దొండపాటి భీమరాజు, రామచంద్రదేవ్, ఎల్.నందికేశ్వరరావు, ఇంజరాపు రమణారావు, వేంకటరావు పాల్గొన్నారు.

అలరించిన 'మతమా? మానవత్వమా?'

అనంతరం లలితశ్రీ కళాసమితి ఆధ్వర్యంలో చక్కని కథాంశంతో 'మతమా? మానవత్వమా?' అనే సాంఘిక నాటిక ప్రదర్శన చక్కగా సాగింది. ఇందులో ఆర్.బోసుబాబు, కె.రాజేశ్వరి, గుత్తు రవిబాబు, ప్రసాద్‌రాళో, బొడ్డేపల్లి లక్ష్మణరావు, పూతి కామేశ్వరరావు చక్కగా నటించి ఆహూతులను అలరించారు.



ప్రసంగిస్తున్న అధ్యక్షులు రామలింగస్వామి

రూ.60 వేల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కొవ్వాడ మెగా యూత్

రణస్థలం: మండలంలోని కొవ్వాడ గ్రామానికి చెందిన మైలపల్లి హరిస్వామి (బుల్లోడు) గాయపడి ప్రాణప్రాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. ఆగస్టు 31న సాక్షిలో ఆదుకోండి అనే వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కొవ్వాడ మెగా యూత్ సభ్యులు రూ.60 వేలు విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని కుటుంబ సభ్యులకు కొవ్వాడలో అందజేశారు.

ఆపరేషన్ గంజాయి!

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని తోటపాలెం, నగర పరిసరాల్లో గంజాయి సేవిస్తున్న తొమ్మిది మంది యువకులను మఫ్టీలో ఉన్న పోలీసులు పట్టుకుని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఐ పైడపునాయుడు పట్టుబడిన వారిలో ఒకరిద్దరిని వెంట పెట్టుకుని గంజాయి క్రయ విక్రయాల మూలాలు (లింక్) తెలుసుకునేందుకు ఆపరేషన్ గంజాయి పేరిట బుధవారం రాత్రి వరకు టాస్క్ రైడ్ కొనసాగించారు. పూర్తి వివరాలు గురువారం వెల్లడయ్యే అవకాశముంది.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాజ్యాంగంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలోని సాంఘిక సంక్షేమ శాఖా బాలికల వసతి గృహంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విభిన్న జాతులు, మతాలు ఉన్నప్పటికీ అందరికి ఒకే రాజ్యాంగం వర్తిస్తుందని చెప్పారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా సత్వర న్యాయం, సమన్యాయం లభిస్తుందన్నారు. ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చన్నారు. అనంతరం వసతి గృహ పరిసరాలను పరిశీలించారు.

కార్యక్రమంలో ఎం.సుజాత, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, పి.చిన్నమ్మి, పి.సరిత, ఎం.స్వర్ణలత, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు అభినందనీయులు

- డీఈవో తిరుమల చైతన్య

శ్రీకాకుళం కల్చరల్: స్కూలు అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య అన్నారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలో విద్యార్థుల కోసం అదే స్కూల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.5.50 లక్షలతో నిర్మించిన భోజనశాలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులంతా కలసి ఈ కార్యక్రమం చేయడం జిల్లాకే తలమానికంగా నిలుస్తుందని అన్నారు. స్కూల్‌లో విద్యార్థుల సంఖ్యను కూడా పెంచేందుకు కృషి చేయాలని కోరారు. పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పాగిడి సుగుణాకరరావు మాట్లాడుతూ.. సంపాదించడం కన్నా సమాజానికి ఏమి ఇచ్చాము అనే అంశం మనిషిని ఉన్నతుడిని చేస్తుందని, ఆదిశగా పూర్వ విద్యార్థుల సంఘం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. హెచ్‌ఎం సీహెచ్ దేవదత్తానంద్ మాట్లాడుతూ.. స్కూల్ అభివృద్ధితోపాటు విద్యార్థులు, టీచర్లకు కూడా ఎంతో సహాయ సహకారాలు అందిస్తు ప్రోత్సాహకరంగా ఉన్నారని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల బోధనా సిబ్బందికి అభినందనలు తెలియచేస్తు డీఈవో చేతుల మీదుగా వారిని సత్కరించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.జి.కె.మూర్తి, జామి భీమశంకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు పేర్ల కామరాజు, ఢిల్లీ భాస్కరరావు, బాబ్జీ, కె.ఫాల్గుణరావు, కె.ఎల్.ఎస్.మూర్తి, ఎం.శ్రీనివాసరావు, టి.బాలమురళీ కృష్ణ పాల్గొన్నారు.



భోజనశాలను ప్రారంభిస్తున్న డీఈవో తిరుమల చైతన్య

పకడ్బందీగా సాగర్ కవచ్

గార: సముద్ర తీరప్రాంతం ద్వారా అనుమానితులు చొరబడకుండా మెరైన్, సివిల్, కోస్టుగార్డు సంయుక్తంగా నిర్వహించే గస్తీ బుధవారం నుంచి ప్రారంభమైంది. రెండు రోజుల పాటు తీర ప్రాంతం, రోడ్డు, సముద్రం గుండా తనిఖీలు చేపట్టనున్నారు. ఈ క్రమంలో గార మండలంలో వాడాడ, శ్రీకూర్మం జంక్షన్, కళింగపట్నంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేశారు. మెరైన్ స్టేషన్ సీఐ బి.ప్రసాదరావు సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కె. మత్స్యలేశం, బందరువానిపేట తీరంలో మత్స్యకారులతో మాట్లాడుతూ ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే సమాచారమివ్వాలని కోరారు. ప్రధాన ఆలయమైన శ్రీకూర్మనాథాలయం వద్ద కూడా గస్తీ ఏర్పాటు చేశారు.



కె.మత్స్యలేశంలో సిబ్బందికి సూచనలిస్తున్న మెరైన్ సీఐ ప్రసాదరావు

నేడు కేంద్ర మంత్రి రాక

శ్రీకాకుళం పాతబస్టాండ్: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు గురువారం జిల్లాలో పర్యటిస్తారని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

సంక్షిప్తంగా...

వేతనాలు అందజేయాలని వినతి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు గత ఎనిమిది నెలగా వేతనాలు అందజేయలేదు. కొందరు ఉద్యోగులు శ్రీకాకుళంలోని కార్మిక శాఖ కార్యాలయంలో లేబర్ కమిషనర్ అజేయ్‌కార్తీక్‌కు బుధవారం తమ సమస్యలు వివరించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. కార్మిక చట్టాల మేరకు 100 రోజుల్లోగా వేతనం చెల్లించాల్సి ఉందని లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. న్యాయం చేయాలని కోరారు.

డీసీహెచ్‌ఎస్‌గా కల్యాణ్‌బాబు



అరసవల్లి: జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారిగా (డీహెచ్‌ఎస్) డాక్టర్ ఎస్.కల్యాణ్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం రాజాం ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారిగా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు డీసీహెచ్‌ఎస్‌గా పనిచేసిన జి.వి.రాజ్యలక్ష్మిని విజయనగరం జిల్లా డీసీహెచ్‌ఎస్ ఇన్‌చార్జిగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా కల్యాణ్‌బాబు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నదీ తీరం కోతపై నివేదిక అందజేత

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో నాగావళి నదీతీరం కోతపై జిల్లా కలెక్టర్‌కు స్థానిక అధికారులు నివేదిక అందజేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు నివేదిక ఇవ్వాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు నదీతీర ప్రాంతాన్ని అధికారులు బుధవారం పరిశీలించారు. డీఈఈలు ఎం.మురళీమోహన్, జీవీ రమణ, ఇంజినీరింగ్ నిపుణులు ఎచ్చెర్ల మండలంలోని తమ్మినాయుడుపేట, పొన్నాడ, కాళింగిపేట, బొంతలకోడూరు గామాలను పరిశీలించి నివేదిక అందజేశారు. నదీతీరంలో గ్రోయిన్లు, రాతి కట్టడాలు నిర్మించాలని స్థానికులు కోరారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం



రైలు పట్టాలపై ఉన్న గుర్తు తెలియని మృతదేహం

జి.సిగడాం: మండలంలోని వాంద్రంగి సమీపంలో రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం బుధవారం లభ్యమైంది. రైలు ప్రయాణం చేస్తూ జారిపడి మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. కుడి చేతి వేలికి వెండి ఉంగరాలు, మెడలో నల్లటి తాడు ధరించి ఉన్నాడని, మృతదేహంను రిమ్స్ ఆస్పత్రిలో ఉంచామని పోలీసులు తెలిపారు.

ఉత్సాహంగా పంచాయితీరాజ్ క్రీడా పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంజినీర్స్ డే వేడుకలను పురస్కరించుకుని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌శాఖ ఉద్యోగులకు నిర్వహించిన క్రీడాపోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో వాలీబాల్‌తోపాటు పలు క్రీడాంశాల్లో పోటీలు బుధవారం జరిగాయి. వాలీబాల్‌లో ఆరు జట్లు ప్రాతినిథ్యం వహించగా.. పాలకొండ విజేతగా, ఎచ్చెర్ల రన్నరప్‌గా నిలిచింది. అంతకు ముందు ఈ పోటీలను జిల్లా పీఆర్‌జేసీఏసీ ప్రధాన కార్యదర్శి కేసీహెచ్ మహింతి ప్రారంభించారు. సంఘ కో–చైర్మన్ ఎస్‌పీఏ పోలినాయుడు, బి.కృష్ణారావు, ఎస్.కోదండరావు, టీవీవీఎం రాజు, బి.అమృత్ పాల్గొన్నారు.

వీక్షిత్ లక్ష్యంపై దృష్టి సారించాలి

శ్రీకాకుళం: వీక్షిత్ ఆంధ్రా 2047 విజన్ లక్ష్యంగా పట్టణ మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేయాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పథక సంచాలకులు ఎం.కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక రైతు బజార్ వద్ద ఉన్న మహిళా సామాజిక వనరుల కేంద్రంలో మెప్మా జిల్లా సిబ్బందికి, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షులకు, పట్టణ సమాఖ్యల ఆర్పిలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మెప్మా పరిపాలనాధికారి ఎస్.వి.రమణ, అకౌంటెంట్ ఎ.వెంకటరావు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతీయ జనతాపార్టీని సంస్థాగతంగా నిర్మాణం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని మాజీ ఎమ్మెల్సీ, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని 80 ఫీట్‌రోడ్‌లో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో బువారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్ర అధికారి ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర నాయకులు పైడి వేణుగోపాలం, శవ్వాన ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

నదిలో వ్యక్తి గల్లంతు

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ గ్రామానికి చెందిన రజకుడు అంపోలు అప్పారావు నాగావళి నదిలో బుధవారం గల్లంతయ్యాడు. భార్య లక్ష్మితో కలిసి పాత పొన్నాడ నదీతీరంలో బట్టలు ఉతుకుతుండగా ప్రవాహ ఉద్ధృతికి రాయి (బల్ల) లోపలికి వెళ్లిపోయింది. దానిని బయటకు తీసే క్రమంలో కొట్టుకుపోయాడు. స్థానికులు గాలించినా ఫలితం లేకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముంపు ప్రాంతాలు పరిశీలన

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పొన్నాం, బట్టేరు, బైరి పరిసర ప్రాంతాల్లో వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలను తహసీల్దార్ ఎం.గణపతిరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయ మాట్లాడుతూ.. ఈ నెల 6, 7 తేదీల్లో బంగాళాఖాతంలో వాయుగుండ ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ముంపు ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు.